# వనదుర్గమ్మకు ఘన పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు పూజాలందుకుంటున్న దుర్గామాత

పాపన్నపేట, అక్టోబర్ 27: ఏడుపాయల వన దుర్గా భవానీ మాత సన్నిధిలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మంజీరా నదిలోని ఆయా పాయల్లో స్నానాలు చేసి వనదుర్గామాత ఆలయంలో పూజలు చేశారు. అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఈవో చంద్రశేఖర్, సిబ్బంది సూర్యశ్రీనివాస్, మాధుసూదన్‌రెడ్డి, బ్రహ్మచారి, రవివీర్‌కుమార్, వరుణాచారి, రాజు, నర్సింలు ఏర్పాట్లు చేశారు. వేదపండితులు శంకర్‌శర్మ, పార్థివశర్మ, రాముశర్మ, రాజశేఖర్ శర్మ తదితరులు పూజలు చేశారు.

# భక్తులతో కిటకిటలాడిన మెదక్ చర్చి



ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 27: మెదక్ చర్చి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి గంటగంటకు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో భక్తులు పాల్గొన్నారు. చర్చి ప్రెసిబెటరీ ఇన్‌చార్జి రెవరెండ్ జార్జి శాంతయ్య భక్తులనుద్దేశించి దైవ సందేశం వినిపించారు. పాస్టర్లు డేవిడ్ రిచర్డ్స్, జైపాల్, శ్రీనివాస్ భక్తులను ఆశీర్వదించారు. చర్చి కమిటీ సభ్యులు భక్తిగీతాలను ఆలపించారు. ప్రార్థనల్లో చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్, జాన్సన్, సువన్‌డగ్లస్, సంశాన్ సందీప్, జాయ్‌ముర్రే పాల్గొన్నారు.

# కరాటేతో ఆత్మరక్షణ, మనసికోల్లాసం



బెల్ట్‌లు సాధించిన విద్యార్థులతో నగేశ్

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 27: కరాటేతో శారీరక పటుత్వం, ఆత్మరక్షణ, మానసికోల్లాసం కలుగుతాయని రెంజుకి షాటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు నగేశ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గుల్షన్‌క్లబ్‌లో ఈ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కరాటే బిల్డ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలోని పలు మండలాలకు చెందిన 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పలువురు బ్లాక్ బెల్టులు, బ్రౌన్ బెల్టులు సాధించారు. విద్యతో పాటు అన్ని రంగాల్లో శిక్షణ పొంది రాణించాలన్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు దినకర్, విద్యాసాగర్, మల్లేశం పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



రామాయంపేటలో..



నిజాంపేటలో..

రామాయంపేట, అక్టోబర్ 27: పురపాలికలోని గొల్పర్తికి చెందిన సీపీఎం నాయకుడు నింగొల్ల సత్యం అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబానికి మెదక్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి రూ.5వేలు, కౌన్సిలర్ నాగరాజు రూ.3వేల ఆర్థిక సాయం అందజేశారు.

**నిజాంపేటలో..**

నిజాంపేట,అక్టోబర్27: నస్కల్ గ్రామానికి చెందిన మెట్టు బాలరాజు గుండెపోటుతో మృతి చెందాడు. ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను డా.మోహన్‌నాయక్ పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయం, 25 కిలోల బియ్యం అందజేశారు.

# దవాఖానను సందర్శించిన ట్రైనీ అధికారులు



అర్బన్ పార్కును పరిశీలిస్తున్న ట్రైనీ సివిల్ సర్వీస్ అధికారులు

నర్సాపూర్,అక్టోబర్27: నర్సాపూర్‌లోని ప్రభుత్వ ఏరియా దవాఖానను ట్రైనీ సివిల్ సర్వీస్ అధికారులు ఆదివారం సందర్శించారు. రోగులకు అందుతున్న చికిత్సల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. నర్సాపూర్ అడవి ప్రాంతంలోని అర్బన్ పార్కును సందర్శించారు. వీరితో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, మేనేజర్ మధుసూదన్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మురళీ, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

# తపస్ జిల్లా మహిళా కార్యదర్శిగా నవనీత



కౌడిపల్లి, అక్టోబర్ 27: తపస్ మెదక్ జిల్లా మహిళా కార్యదర్శిగా మాసన్నగారి నవనీత ఎంపీపీఎస్ ధనుజా తండా, కౌడిపల్లి మండలం నుంచి ఎన్నికైనట్లు జిల్లా మహిళా అధ్య క్ష, ప్రధాన కార్యదర్శులు స్వరూపరాణి, సు జాత తెలిపారు. జిల్లాలో తపస్ అభివృద్ధికి కృషి చేస్తామని, రాష్ట్ర, జిల్లా శాఖల ఆదేశాలను పాటిస్తూ, ఉపాధ్యాయు లు, విద్యారంగానికి అవసరమైన సేవలు అందిస్తామని నవనీత తెలిపారు.

# ఘనంగా మాల మహానాడు ఆవిర్భావ వేడుకలు



రామాయంపేటలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

రామాయంపేట, అక్టోబర్ 27: రామాయంపేటలోని మెదక్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి మాల మహానాడు నాయకులు ఆదివారం నివాళులర్పించారు. అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బైరం సిద్ధరాములు, బైరంకుమార్, బాబు, రాజయ్య, పరమేశ్, భాగయ్య, శ్యాంసుందర్, యూత్ సభ్యులు వెంకటి, ప్రశాంత్, శ్రీకాంత్, మహేశ్, కాశి, నాగరాజు, నరేందర్, ఈశ్వర్, స్వామి పాల్గొన్నారు.

# రైతు కష్టం అడవి జంతువుల పాలు



అడవి పందులు పాడుచేసిన అంతర పంట టమాట



ధ్వంసమైన మొక్కజొన్న పంట



కాపలాకోసం మంచె వేసుకున్న రైతు

- రైతుల ఉసురుతీస్తున్న అడవి పందులు
- భయం గుప్పిట్లో అన్నదాతలు
- పంటల ధ్వంసంతో రైతులకు నష్టం

**ఆరుకాలం కష్టపడి సాగు చేస్తే నోటి కాడికొచ్చిన పంటను అడవి జంతువుల ధ్వంసం చేస్తున్నాయి. అప్పులు చేసి సాగుచేస్తే పంటలన్నీ అడవి జంతువుల పాలవుతున్నాయి. వాటి నుంచి పంటలను రక్షించుకునేందుకు రాత్రింబవళ్లు కాపలాగాస్తున్నారు. కాపలా ఉన్న రైతులపై దాడులు చేస్తున్నాయి. పెరిగిన పంటలను పెరిగినట్లే నాశనం చేస్తున్నాయి.**

రామాయంపేట, అక్టోబర్ 27: పంటలు రక్షించుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. రాత్రి వేళల్లో చేల వద్దకు కాపలాగా వెళ్లిన రైతులపై అడవి జంతువులు దాడికి తెగబడుతున్నాయి. దీంతో పంటలను సాగు చేయాలంటే రైతులు జంకుతున్నారు. కొన్నేండ్లుగా రామాయంపేట, నిజాంపేట, నార్సింగి, చేగుంట తదితర మండలాల్లోని దంతెపల్లి, సుతారిపల్లె, నందిగామ, నర్సంపల్లి, భీంరావుపల్లి, వడియారం కల్వకుంట, నస్కల్, రాంపూర్, డి.ధర్మారం, తిప్పనగుళ్ల, తొనిగండ్ల, నగరం, నందగోకులం తదితర గ్రామాలకు దగ్గర్లోనే అడవి ఆనుకుని ఉంది. ఈ ప్రాంత రైతులు పంటలు సాగు చేయాలంటే భయపడుతున్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పంటలు సాగు చేస్తున్నారు. ఇన్ని కష్టాలకోర్చి సాగు చేసిన పంటలు చేతికి రాకముందే అడవి జంతువుల పాలిట ఆహారంగా మారుతున్నాయి. ప్రభుత్వం పంటకు మద్దతు ధర ఇచ్చినా అడవి జంతువులతో రైతులకు ప్రాణహానితో పాటు నష్టాలకు గురవుతున్నారు. రామాయంపేట, నిజాంపేట, చేగుంట, తూప్రాన్, మనోహరాబాద్ మండలాల వ్యాప్తంగా పంటలు విత్తుకున్నప్పటి నుంచిం పంట చేతికొచ్చేంత వరకు కాపలాగా ఉండాల్సిందే. పంట వద్ద పొద్దంతా కోతులతో, రాత్రయితే అడవిపందులతో సహవాసం చేయాల్సిందే. జంతువులు రాత్రి పూట ఎక్కువ శాతం పంటచేలకు వచ్చి రైతులపై దాడులు చేసిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు నష్టపోయిన రైతులకు పంటల అంచనా వేసి ఫారెస్టు, వ్యవసాయశాఖ అధికారులతో నష్టపరిహారం అందించేది. ప్రస్తుతం నష్టాలకు గురైనా అధికారులు పంట నష్టం వేయడంలేదు. పరిహారం ఇవ్వడం లేదు. ఇప్పటికైనా నష్టాలకు గురైన రైతులను ప్రభుత్వం, వ్యవసాయ శాఖ, అటవీ శాఖ అధికారులు గుర్తించి నష్ట పరిహారం అందించేలా అంచనా వేయాలని రైతులు కోరుతున్నారు.

### ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి



అడవి పందుల మూలంగా చేతికొచ్చిన పంటలన్నీ నాశనమవుతున్నాయి. ప్రభుత్వం అడవి జంతువుల మూలంగా దెబ్బతిన్న పంటలను సర్వే చేసి రైతులను ఆదుకోవాలి. లేకుంటే రైతులు రోడ్డు మీద పడే అవకాశం లేకపోలేదు. ఆరుగాలం కష్టపడి పంట పండిస్తే నోటికొచ్చే నాటికి పంటంతా కోతులు, పందుల పాలవుతున్నది. ప్రభుత్వ అధికారులు పంట నష్టం సరిగ్గా అంచనా వేసి పరిహారం ఇవ్వాలి

**- వీరబోయిన రామస్వామి, రైతు, నందిగామ రామాయంపేట**

### పంటకు కాపలాగా పాత చీరలు



చేతికొచ్చిన దోస పంట పాడవకుండా, అడవి పందులు రాకుండా పొలం చుట్టూరా పాత చీరలతో బెదురు పెడ్తున్నాం. రాత్రిల్లు పంట వద్దే ఉండి మంచెలు ఏర్పాటు చేసుకుని అక్కడే నిద్రిస్తున్నాం. ఎక్కడి నుంచో మందలాగ పదుల సంఖ్యలో వచ్చే పందులు పంటనంతా నాశనం చేస్తున్నాయి. చేతిలో కట్టె లేకుండా పంటచేను వద్దకు వెళ్లలేక పోతున్నాం.

**- నారాయణ, శ్యామల, రైతు దంపతులు**

### రైతులు అప్రమత్తంగా ఉండాలి



అడవి జంతువుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి. అశ్రద్ధ వహించకుండా జాగ్రత్తలు వహించాలి. లేకుంటే వాటితో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. మొక్కజొన్న ఇతర పంటలు ఇప్పుడిప్పుడే చేతికి వస్తున్నాయి. ఈ జంతువులతో రైతాంగం పూర్తిగా నష్టాలకు గురవుతున్నది. జంతువులు రైతులపై దాడులు చేస్తున్న ఘటనలు కూడా ఉన్నాయి. అందుకోసం చేతిలో కట్టెలు లేకుండా పొలాల వద్దకు వెళ్లొద్దు.

**- రాజ్‌నారాయణ, వ్యవసాయ శాఖ అధికారి, రామాయంపేట**

# కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



మెదక్ రూరల్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు



రామాయంపేట: రాయిలాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ సిబ్బంది



మెదక్ మున్సిపాలిటీ: ఎమ్మెల్యే రోహిత్‌రావుకు వినతి పత్రం అందజేస్తున్న డీపీఎస్‌ఈ అభ్యర్థులు

**- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు**

మెదక్ మున్సిపాలిటీ/మెదక్‌రూరల్, అక్టోబర్ 27: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి, రైతులు మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. ఆదివారం మండలంలోని మాగ్దుంపూర్, పట్టణంలోని దాయర పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మెదక్ పీఏసీఎస్ చైర్మన్ చిలుముల హనుమంత్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పంటకు మద్దతు ధర కల్పించి రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ రాజలింగం, డైరెక్టర్ గందె రాములు, మాజీ సర్పంచ్ కళావతి, మాజీ ఉపసర్పంచ్ రజనీకాంత్, ఏఈవో రాజశేఖర్, నాయకుడు అరవింద్ పాల్గొన్నారు

**పిల్లల దవాఖాన ప్రారంభం**

మెదక్‌లోని అజంపూరలో పిల్లల దవాఖాన, దంత వైద్యశాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. వైద్యులు తిరుమలేశ్, స్వాతి ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కల్యాణి, నాయకులు ఆంజనేయులుగౌడ్, హాఫీజోద్దీన్, గంగాధర్, సిద్దయ్య పాల్గొన్నారు.

**ప్రీప్రైమరీ టీచర్లుగా ఉద్యోగాలు కల్పించాలి**

డీసెట్ ద్వారా డీపీఎస్‌ఈ (డిప్లామా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్) కోర్సు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ టీచర్లుగా ఉద్యోగాలు కల్పించాలని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఎన్‌ఈపీ 2020 ప్రకారం రెండేండ్లు డీపీఎస్‌ఈ కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగాలు కల్పించే దిశగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు.

**రాయిలాపూర్‌లో కొనుగోలు కేంద్రం**

రామాయంపేట, అక్టోబర్ 27: రాయిలాపూర్ గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, కార్యదర్శి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈవో.సాయికృష్ణ, కుమారస్వామి, సార్గు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

# ఒక డీఏ ప్రకటించడం విచారకరం



మెదక్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ సమావేశంలో ఉద్యోగులకు ఒక విడత డీఏ మంజూరు చేయడంపై విచారం వ్యక్తం చేస్తున్నారని ఉద్యోగుల ఐకాసా జిల్లా చైర్మన్ దొంత నరేందర్ తెలిపారు. ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థను అర్థం చేసుకంటామని, ఉద్యోగులకు న్యాయంగా చేయాలని కోరారు. ఆయన వెంట టీఎన్జీవో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, సహ అధ్యక్షుడు ఎండి ఇక్బాల్ పాష, కోశాధికారి చంద్రశేఖర్ ఉన్నారు.

# మల్లన్నకు భక్తుల పూజలు



మెదక్‌రూరల్, అక్టోబర్ 27: మంబోజిపల్లి శివారులోని కొయ్యగుట్ట పై కొలువుదీరిన మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం పూజారి మల్లన్న ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి, ఎల్లమ్మకు ఒడిబియ్యం సమర్పించారు.

# గురుకుల ప్రిన్సిపల్‌కు ఘన సన్మానం




రామాయంపేట, అక్టోబర్ 27: రామాయంపేట గురుకుల ప్రిన్సిపాల్ సుధారాణిని విద్యార్థుల తల్లితండ్రుల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఏఎస్‌వో సురేందర్‌రెడ్డి, గురుకుల పేరెంట్స్ కమిటీ చైర్మన్ సురేందర్, సిద్దిరాములు, ఏసుపాల్, చందు, శోభ ఉన్నారు.

# ప్రయాణం.. నరకప్రాయం

- ప్రమాదాలు జరుగుతున్నా పట్టదా..?
- కంకర తేలిన రోడ్లు
- కానరాని సూచిక బోర్డులు
- నిమ్మకు నీరెత్తిన కాంగ్రెస్ సర్కార్



నస్కల్ వెళ్లే రోడ్డు దుస్థితి



కంకర తేలిన రాంపూర్ రోడ్డు

రామాయంపేట, అక్టోబర్ 27: కంకర రోడ్లపై ప్రయాణం.. ప్రస్తుత సర్కార్ తట్టెడు మట్టి కూడా పోసిన దాఖలాలు లేవు. దీనికి తోడు రోడ్లలో పెద్ద పెద్ద గుంతలు. ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడు లేక వాహనదారులు బిక్కుబిక్కుమంటున్నారు. రామాయంపేట, నిజాంపేట మండలాల్లోని రాంపూర్, నస్కల్, కాట్రియాల, పర్వతాపూర్, దంతెపల్లి, లక్ష్మాపూర్, తొనిగండ్ల, చల్మెడ, రాయిలాపూర్, బచ్చురాజుపల్లి, సుతారిపల్లి, శివ్వాయపల్లి తదితర గ్రామాలకు వెళ్లాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. రాత్రి పూట ఏ గ్రామానికి వెళ్లినా ఆ ప్రయాణం నరకమే. ఏ రోడ్డును చూసినా ప్రమాదాలే. రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు ఉదయం నుంచి రాత్రి వరకు 108 అంబులెన్సులో ప్రమాదాలు జరిగిన వారు ఎంతో మంది వస్తూనే ఉంటారు. రోడ్ల కోసం కోట్లాది రూపాయలు మంజూరయ్యాయని పత్రికల్లో చెప్పడమే తప్ప, ఎక్కడా రోడ్డేసిన దాఖలాల్లేవు. ఇప్పటికైనా సంబంధిత నాయకులు రోడ్ల గురించి పట్టించుకుని వాహనదారుల ప్రాణాలు రక్షించాలని ప్రజలు కోరుతున్నారు. కనీసం సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం విడ్డూరంగా ఉందని పట్టణ వాసులు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేశాం



ఉమ్మడి రామాయంపేట మండలంలోని రోడ్లు బాగా లేవని రోడ్లు భవనాల శాఖ అధికారులను కలిసి విన్నవించాం. రోడ్ల మూల మలుపులపై సూచిక బోర్డులు లేక ప్రమాదాలు రోజురోజుకు ఎక్కువవుతున్నాయి. నిజాంపేట మండలంలో నస్కల్, రాంపూర్, నందగోకుల్ రోడ్లపై దుమ్మురేగుతున్నది. రోడ్డులో కంకర పోసిన కాంట్రాక్టర్ కనీసం వాటి మీద డాంబర్ పోయలేదు.

**- శంకర్‌గౌడ్, కార్తీక్, రామాయంపేట**

# మూల మలుపులతో జాగ్రత్త

**కలుపు మొక్కల చాటున సూచిక బోర్డులు**

నిజాంపేట, అక్టోబర్ 27: నిజాంపేట నుంచి రజాక్‌పల్లి, జడ్చెరువు తండా, బచ్చురాజ్‌పల్లి, కల్వకుంట గ్రామాలకు వెళ్లే రోడ్డు వెంబడి ఇరువైపులా కలుపు మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో మూల మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు సరిగ్గా కనబడక, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ఈ గ్రామాల వెంబడి నూతనంగా రోడ్డు నిర్మాణం చేపట్టినప్పుడు సదరు కాంట్రాక్టర్ ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు నేడు ఏపుగా పెరిగిన చెట్ల పొదల్లో కనబడకుండా ఉన్నాయి. ఇది కూడా ప్రమాదాలు జరుగడానికి ఒక కారణమవుతున్నది.



కలుపు మొక్కల చాటున ఉన్న సూచిక బోర్డు



నిజాంపేట నుంచి బచ్చురాజ్‌పల్లికి వెళ్లే దారిలో కలుపు మొక్కలతో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

### రోడ్డు ఇరువైపులా పొదలు తొలిగించాలి



నిత్యం వివిధ అవసరాలకు మా గ్రామం బచ్చురాజ్‌పల్లి నుంచి నిజాంపేటకు వెళ్తుంటాం. నిజాంపేటకు వస్తున్న క్రమంలో రోడ్డుకు ఇరువైపులా అధికంగా పెరిగిన పిచ్చి మొక్కలతో మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. ఎదురుగా వస్తున్న వాహనం కాని వ్యక్తులు కనబడక చాలాసార్లు ప్రమాదాలు జరిగాయి. పంచాయతీ కార్యదర్శులు వారి గ్రామాల పరిధిలో రోడ్డుకు ఇరువైపులా, సూచిక బోర్డుల వద్ద ఉన్న పిచ్చి మొక్కలు తొలిగిస్తే మూలమలుపుల వద్ద ప్రమాదాలు జరుగవు.

**- కిషన్, బచ్చురాజ్‌పల్లి, నిజాంపేట మండలం**


# ఎలుకల మందుతాగి విద్యార్థి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యకు యత్నించిన విద్యార్థి వరుణ్‌తేజ్

కౌడిపల్లి, అక్టోబర్ 27: ఎలుకల మందు తాగి విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన మండల కేంద్రమైన కౌడిపల్లిలోని తెలంగాణ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో శనివారం రాత్రి చోటుచేసుకున్నది. రాత్రి స్టడీ అవర్ ప్రాంతంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి వరుణ్‌తేజ్ విద్యార్థుల ఎదుట (ఎస్ఏ) పరీక్షల్లో మార్కులు తక్కువగా వస్తాయని, భయంతో ఎలుకల మందు తాగాడు. ఇది గమనించిన తోటి విద్యార్థులు వెంటనే పాఠశాల సిబ్బందికి తెలిపారు. దీంతో సిబ్బంది వెంటనే మెదక్ ప్రభుత్వ దవాఖానకు బాలుడిని తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖానకు తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం విద్యార్థి పరిస్థితి నిలకడగా ఉందని పాఠశాల ప్రిన్సిపల్ ఫణికుమార్ తెలిపారు.

# మాజీ మంత్రి మనుమరాలి పెళ్లిలో ఎమ్మెల్యే సునీతారెడ్డి



నర్సాపూర్, అక్టోబర్ 27: మాజీ మంత్రి మల్లారెడ్డి మనుమరాలి వివాహ వేడుకకు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆదివారం హాజరై వధూవరులను ఆశీర్వదించారు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★హైదరాబాద్ & తెలంగాణ జిల్లాల్లోని ప్రముఖ టెలికాం టవర్ కంపెనీలో పనిచేయడానికి డిప్లొమా/ ITI చదివిన ఎలక్ట్రీషియన్లు కావలెను. ఫోన్: 9177333979.

NT-98842

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.